పచ్చదనం మాటున ముప్పు

- ప్రమాదకరంగా కోనోకార్పస్ చెట్లు
- పుప్పొడితో అలర్జీ, ఆస్తమా
- భూగర్భ జలాలతో పాటు ఆక్సిజన్‌ను హరిస్తాయి
- నగరంలో పలు చోట్ల దర్శనమిస్తున్న చెట్లు




ఈ తాండ్రపాడులో రాయలసీమ ఆల్కాలీస్ ఫ్యాక్టరీ చుట్టూ ఏపుగా పెరిగిన కోనో కార్పస్ చెట్లు, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రమాదకర కోనో కార్పస్ చెట్లు

కర్నూలు (న్యూటౌన్): ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పెను ప్రమాదకరమైన కోనో కార్పస్ చెట్లు కర్నూలు నగరంలో ఎక్కడ పడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. పలు దేశాలు ఐదేళ్ల క్రితమే ఈ మొక్కలను నిషేధించాయి. ఈ మొక్క పుష్పం నుంచి వెలువడే పుప్పొడితో అలర్జీ, శ్వాసకోస, ఆస్తమా సమస్యలు వస్తున్నాయని పరిశోధనల్లో తేలింది. అయితే ఈ ప్రమాదకర మొక్కలను కర్నూలు నగరంలోని ప్రధాన రహదారులతో పాటు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, కర్నూలు మండలం ఈ తాండ్రపాడు గ్రామంలోని రాయలసీమ ఆల్కాలీస్ ఫ్యాక్టరీ చుట్టూ విచ్చలవిడిగా నాటారు. గతంలో పని చేసిన మున్సిపల్ కమిషనర్ రోడ్ల మధ్య ఈ మొక్కలను నాటించడంతో చాలా మంది ప్రజలు తమ ఇళ్ల వద్ద కూడా వీటిని ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం ఇవి పలు ప్రాంతా ల్లో ఏపుగా పెరిగాయి. అయితే కోనో కార్పస్ చెట్లతో కలిగే అనర్థాలు ఆలస్యంగా వెలుగు చూస్తున్నాయి.

చూడ్డానికి అందంగా ఉన్నా ...

రోడ్ల మధ్యలో, వివిధ ప్రభుత్వ కార్యాలయాల సముదాయాల్లో నాటిన ఈ మొక్కలు ఏపుగా పెరగడం వల్ల పరిసరాలకు అందాన్ని ఇస్తాయి. గొడుగులా పెరిగి నీడనిస్తాయి. చూడ్డానికి అందంగా ఉన్నా ఈ కిల్లర్ చెట్లపై సీతాకోక చిలుకలు వాలవు, ఎందుకంటే ఆ చెట్టు పుప్పొడి అంతటి విషతుల్యం. ఈ మొక్కలతో కీటకాలు, పక్షులకు ఎలాంటి ఉపయోగం లేదు. ఏ జంతువు వీటి ఆకులను తినదు. ఇవి సముద్ర తీర ప్రాంతాల్లో పెరిగే మొక్క. దీని వేర్లు భూమిలోపలకి 80 మీటర్లపైనే వెళ్తాయి. ఈ వేర్లు భూగర్భ జలాలను పీల్చేస్తాయి. ఒక వేళ ఇంట్లో పెంచుకున్నట్లయితే పునాదులకి కూడా ప్రమాదమే. వీటి వేర్లు లోతుకు పోవడంతో డ్రైనేజీ లైన్లు, మంచినీటి వ్యవస్థను ధ్వంసం చేస్తాయి. ఈ మొక్కల వల్ల వాతావరణంలో ఆక్సిజన్ లెవెల్స్ తగ్గిపోయే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే అధికారులెవరూ ఈ మొక్కలు చేసే హానిని ఇంతవరకూ గుర్తించకపోవడం గమనార్హం. చాలా దేశాల్లో కోనో కార్పస్ మొక్కను నిషేధించాయి. ఇటీవలే తెలంగాణ ప్రభుత్వంతో పాటు మరి కొన్ని రాష్ట్రాలు కూడా ఈ మొక్కను బ్యాన్ చేశాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోనో కార్పస్ మొక్కల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కోనో కార్పస్ చెట్లు ఆరోగ్యానికి హానికరం



కోనో కార్పస్ మొక్కలను అనేక దేశాలు నిషేధించాయి. ఈ మొక్కలు పెంచే ప్రాంతాల్లో ఆక్సిజన్ లెవెల్స్ పూర్తిగా తగ్గిపోతాయి. వీటి వేర్లు 80 మీటర్ల లోతుకుచొచ్చుకెళ్లి భూగర్భ జలాలను పీల్చేస్తాయి. కోనో కార్పస్ పుప్పొడి అత్యంత విషతుల్యం. ఈ చెట్టుపై సీతాకోక చిలుకలు వాలవు. అలాగే ఏ జంతువూ వీటి ఆకులను తినదు. కోనో కార్పస్ మొక్కలు ఆరోగ్యానికి హానికరం.

– కేవీ మధుసూదన్, బాటనీ లెక్చరర్, ఫర్‌మెన్ డిగ్రీ కాలేజీ

ప్రభుత్వం నుంచి ఆదేశాలొస్తే తొలగిస్తాం



కోనో కార్పస్ మొక్కల పుప్పొడితో అనర్థాలు వస్తాయని నా దృష్టికి రాలేదు. ఉద్యాన శాఖ అధికారులతో సంప్రదిస్తాం. కోనో కార్పస్ చెట్లతో అలర్జీ, ఆస్తమా, శ్వాస కోశ వ్యాధులొస్తాయని నిర్ధారిస్తే ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే ఈ మొక్కలను కచ్చితంగా తొలగించి వాటి స్థానంలో ప్రజలకు ఎలాంటి హాని కలిగించని మొక్కలను నాటుతాం.

– భార్గవ తేజ, మున్సిపల్ కమిషనర్, కర్నూలు

గోరంట్లలో ఘనంగా దేవర

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలో బుధవారం శ్రీమారెమ్మ దేవరను ఘనంగా నిర్వహించారు. 15 సంవత్సరాల తర్వాత ఈ ఉత్సవాలు నిర్వహించడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి ఇల్లు బంధువులు, స్నేహితులతో కళకళలాడింది. ముందుగా గ్రామ సర్పంచు బాలకృష్ణ గ్రామపెద్దలతో మారెమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా గ్రామంలో త్సవాలు ప్రశాంతంగా జరిగేలా కోడుమూరు ఎస్‌ఐ విష్ణునారాయణ తన సిబ్బందితో గట్టి బందోబస్తు చేపట్టారు.

బీమాతో భరోసా



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

ఓర్వకల్లు: తపాలాశాఖ అమలు చేస్తున్న జీవిత బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు కోరారు. తపాలా బీమా ఆవిర్భావ వేడుకలను బుధవారం స్థానిక పొదుపు భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరిటెండెంట్ మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడిన ప్రతి పౌరుడు బీమా చేసుకోవాలన్నారు. దీని వల్ల భవిష్యత్‌కు భరోసా ఉంటుందన్నారు. అనంతరం అత్యధిక బీమా పాలసీలు చేసిన పోస్టల్ సిబ్బందికి బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ డివిజన్లకు చెందిన డీపీఎంలు, ఓర్వకల్లు, బేతంచెర్ల, కర్నూలు కృష్ణానగర్‌కు చెందిన ఎస్‌పీఎంలు మల్లిఖార్జున, స్వామినాయక్, తులసీకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

కర్నూలు న్యూటౌన్: పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కర్నూలు డీఈఓ రంగారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి కర్నూలు మండలం వెంకాయపల్లె, మిలిటరీ కాలనీలో విద్యార్థులు ఇంటి వద్ద ఎలా చదువుతున్నారో తెలుసుకునేందుకు నైట్ విజన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు రాత్రి 10 గంటల వరకు, మళ్లీ ఉదయం 5 గంటలకే లేచి చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు సరిగా చదివేటట్లు చూసుకునే బాధ్యత తల్లిదండ్రుల దేనని చెప్పారు. సెల్‌ఫోన్లు, టీవీలు వాడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని సూచించారు. ఉపాధ్యాయులు వారంలో కనీసం రెండుసార్లు నైట్ విజన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మిలిటరీ కాలనీ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం విజయమ్మ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుంకులమ్మకు బంగారు ఆభరణం విరాళం



బంగారు ఆభరణం

గూడూరు రూరల్: కె.నాగలాపురంలో వెలసిన గ్రామ దేవత సుంకులాపరమేశ్వరీదేవికి బుధవారం పంది పాడు గ్రామానికి చెందిన భక్తుడు ఈశ్వరయ్య రెండు తులాల బంగారు ఆభరణా న్ని విరాళంగా అందించారు.దాతకు ఆలయం తరపున విరాళ రసీదు, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించినట్లు ఈఓ దినేష్ తెలిపారు.

సచివాలయాల ద్వారా మెరుగైన సేవలందించండి

సి.బెళగల్: సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వారికి మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ రాముడు అన్నారు. బుధవారం ఆయన ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి మండల పరిధిలోని సంగాల గ్రామ సచివాలయానికి తనిఖీ చేశారు. సచివాలయ సేవల వివరా లు, ఉద్యోగులు హాజరు, కార్యాలయ నిర్వ హణ రికార్డులను పరిశీలించారు. అనంతరం సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లతో సమీవేశమై ప్రజలకు జవాబుదారిగా ఉండా లని సూచించరాఉ. అలాగే ప్రతి రోజు ప్రతి రోజు మధ్యాహ్నం మూడుగంటల నుంచి స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈ కా ర్యక్రమంలోఉద్యోగులందరు హాజరై ఫేషి యల్ యాప్‌లో హాజరు నమోదు చేసుకోవాల ని చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ అధికారుల సంక్షేమానికి కృషి



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

సి.బెళగల్: ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఎస్సీ, ఎస్టీ అధికారులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి కృషి చేస్తామని ఏపీ ఎస్సీ, ఎస్టీ గజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎంపీడీఓ రాముడు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఆ సంఘం జిల్లా అదనపు సాధారణ కార్యదర్శి, సి.బెళగల్ పశువైద్యుడు ప్రవీణ్ ఇతర మండల అధికారులతో కలిసి ఏపీ ఎస్సీ, ఎస్టీ గజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం డైరీ, క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఐక్యమత్యంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సందీప్, ఎంఈఓ జ్యోతి, ఉపాధిహామీ ఏపీఓ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పెంచండి



పంట కోత ప్రయోగం చేస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: మండలంలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత పెంచాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం పాలకొలను గ్రామంలో రైతు శ్రీనివాస ఆచారి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన శనగను పంటకోత ప్రయోగం చేశారు. ఎకరానికి 6.5 నుంచి 7.5 క్వింటాళ్ల వరకు శనగ దిగుబడి వస్తోందని నిర్ధారించారు. ఈ సందర్భంగా డీపీఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. అలాగే మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుధాకర్, ఏఈఓ భాస్కర్, మండల టెక్నీషియన్ ఆంజనేయులు, పీఆర్పీ లక్ష్మీనారాయణ, జెడ్ఎన్ఎఫ్ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు

జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

- పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ రామచంద్రయ్య



గొర్రెల చెవులకు ట్యాగ్ వేస్తున్న అధికారులు

కల్లూరు: గొర్రెలు, మేకలు తదితర మూగజీవాలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ రామచంద్రయ్య పెంపకందారులకు సూచించారు. బుధవారం కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామంలో జాతీయ (పీపీఆర్) చీడ పారుడు వ్యాధి నివారణ కార్యక్రమం నిర్వహించారు. పశుసంర్ధక శాఖ జేడీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పీపీఆర్ వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం ఈ నెల 28 వరకు జరుగుతుందన్నారు. ముందుగా గొర్రెల, మేకల చెవులకు పోగులు (ట్యాగ్) వేశారు. టీకాలు వేసిన గొర్రెలు, మేకల వివరాలను ఇనాఫ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని పశువైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ దుర్గా ప్రసన్న బాబు, జిల్లా పశు వ్యాధి నివారణ ప్రయోగశాల సహాయ సంచాలకులు డాక్టర్ జి.రవిబాబు,పశుసంవర్ధక శాఖ కల్లూరు సహాయ సంచాలకులు పార్థసారథి, చిన్నటేకూరు పశువైద్యుడు డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ మునిస్వామి, సర్పంచ్ పద్మావతి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన



సామూహిక సీమంతం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కోడుమూరు రూరల్: గర్భిణులు ఆరోగ్యం విషయం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన కల్పించారు. పులకుర్తి అంగన్‌వాడీ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. తర్వాత వైఎస్సార్ సంపూర్ణ పోషణ, 1000 రోజుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి అంగన్ వాడీ సెంటర్‌లో గర్భిణులకు పౌష్టికాహారం, రక్తహీనతతో బాధపడే వారికి ఐరన్, కాల్షియం మాత్రలు అందజేస్తున్నట్లు సూపర్‌వైజర్ రాజమ్మ తెలిపారు.

పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి

- బ్రాహ్మణపల్లె వద్ద ఎంఎస్ఎంఈ పార్కు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని



పరిశ్రమ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బ్రాహ్మణపల్లె గ్రామ సమీపంలో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కుకు బుధవారం ఆయన భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఎస్ఎన్ఎస్ సుధీర్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓర్వకల్లు ప్రాంతం పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఉందన్నారు. దీంతో వేలాది ఎకరాల ప్రభుత్వ భూమిని ఏపీఐఐసీకి అప్పగించడం జరిగిందన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తే తక్షణమే వారికి అవసరమైన భూమిని కేటాయిస్తామన్నారు. అందులో భాగంగానే సుధీర్ ఇండస్ట్రీస్ వారు బ్రాహ్మణపల్లె వద్ద 85 సెంట్ల స్థలంలో రూ.4.5 కోట్ల పెట్టుబడితో ఎంఎస్ఎంఈ పార్కును స్థాపించడం అభినందనీయమన్నారు. ఈ పరిశ్రమలో గృహోపకరణ వస్తువులు తయారు చేస్తారన్నారు. దీని వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విశ్వేశ్వరరావు, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, విద్యుత్ ఏఈ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటి ముంపు సమస్యకు త్వరలో పరిష్కారం

పాణ్యం: ఆలమూరు గ్రామంలో నీట మునుగుతున్న పంట పొలాలకు శాశ్వత పరిష్కా రం చూపుతామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. అనారోగ్యంతో ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దిలేటిరెడ్డిని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు ఎమ్మెల్యేను కలిసి ఎస్సార్బీసీ కాల్వ లీకేజీకి తోడు స్థానిక చెరువు అలుగు నుంచి నీరు దిగువకు వస్తుండటంతో ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో సుమారు 200 ఎకరాల పంటలు నీట మునుగుతున్నాయని తెలిపారు. త్వరలో ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జెట్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, సర్పంచ్ ముల్ల మహ్మద్ షరీఫ్ కరుణాకర్‌రెడ్డి, జయ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఏఓ

సి.బెళగల్: గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని గుండ్రేవులు సచివాలయ నోడల్ అధికారి, ఏఓ మల్లేష్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన ఉద్యోగులు, వలంటీర్లతో మా ట్లాడుతూ గ్రామ సచివాలయంలోని ఉద్యోగుల హాజరు, పనితీరుపై ఫిర్యాదులొస్తున్నాయన్నారు. తీరు మార్చుకోకపోతే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి నిర్వహణపై అధికారులకు, పారిశుద్ధ్య కూలీలకు సూచనలు చేశారు. అంతకు ముందు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుకల నగదును అందజేశారు.

పారదర్శక పాలనే ప్రభుత్వ లక్ష్యం



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: అవినీతి అక్రమాలకు తావు లేకుండా పారదర్శక పాలనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పాణ్యం బీసీ కాలనీలో గడపగడపకు–మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలను పూర్తిస్థాయిలో బలోపేతం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. పేదలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యమే లక్ష్యంగా ఆయా రంగాల్లో పలు సంస్కరణలు చేపట్టినట్లు చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగా ప్రస్తుతం దళారీ వ్యవస్థ లేదన్నారు. ప్రతి పథకం నేరుగా అర్హులైన పేదలకే అందుతుందన్నారు. ఇలాంటి పాలన వ్యవస్థ దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేదన్నారు. రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం కృషి చేస్తున్నారన్నారు. ప్రతి సంక్షేమ పథకంలో వారికే పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వమందిస్తున్న ప్రోత్సాహంతో మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అనంతనం బీసీ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యేకు కొందరు సమస్యలు విన్నవించగా వాటిని అక్కడికక్కడే అధికారులకు చెప్పి పరిష్కరించారు.

రెండో రోజూ శివస్వాములతో భిక్ష

గడపగడపకు–మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి రెండో రోజు కూడా పాణ్యం చెంచు కాలనీలో శివమాలాధారులతో కలిసి మధ్యాహ్నం భిక్ష స్వీకరించారు. ముందుగా ఆయన పరవశివుడికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెట్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, గడివేముల జెట్పీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ పల్లవి, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, మండల కనీ్వనర్ కరుణాకర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, ఉసేన్‌బాషా, రాజన్న, బాబు, గౌడ్, తహసీల్దార్ మల్లిఖార్జున రెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం

సి.బెళగల్: ప్రభుత్వం పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, ఈ విషయంలో వంట ఏజెన్సీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రం సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ రాముడు, ఎంఈఓ జ్యోతి, ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి మధ్యాహ్న భోజన పథకం అమలును తనిఖీ చేశారు. వంట పాత్రలు, వంట గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి రోజు మెనూ ప్రకారం నిర్వాహకులు ఆహార పదార్థాలు వడ్డిస్తున్నారా లేదా అని ఉపాధ్యాయులు చూడాలన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



ఉల్చాలలో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

- కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్
- ఉల్చాలలో గడప గడపకు మన ప్రభుత్వం

కర్నూలు (న్యూటౌన్): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. బుధవారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో వారికి చేకూరిన లబ్ధిని వివరించారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయాలనే ఉద్దేశంతో స్థానికంగానే సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేశామని చెప్పారు. రైతులకు మెరుగైన సేవలందించేందుకు రైతుభరోసా కేంద్రాలు నెలకొల్పామన్నారు. దీంతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. అందులో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకొచ్చారన్నారు. దీని వల్ల డాక్టర్లు ఇంటి వద్దకే వచ్చి అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారన్నారు. అనంతరం ఎమ్మెల్యే జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమయానికి ఉపాధ్యాయులు వస్తున్నారా? జగనన్న విద్యా కానుక కిట్ అందించారా? మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకుని ఉన్నతస్థానాల్లో స్థిరపడాలని వారికి సూచించారు. అంతకు ముందు గ్రామస్తులు ఎమ్మెల్యే సుధాకర్, కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, మాజీ మండల ఉపాధ్యక్షుడు వాసు, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్‌ను గ్రామ ప్రజలు సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, సొసైటీ చైర్మన్లు వంశీకృష్ణారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, పీఆర్ ఏఈ రవిమోహన్‌రెడ్డి, ఈఓఆర్డీ నాగేశ్వర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రంగస్వామి, ఎలక్ట్రికల్ ఏఈ ఆంజనేయశాస్త్రి, మాజీ ఎంపీటీసీ సభ్యులు చిన్న లక్ష్మన్న, స్కూల్ కమిటీ చైర్మన్ అలీషేర్‌బాషా, గొర్రెల సంఘం చైర్మన్ గోకారి, వైఎస్సార్‌సీపీ 12వ వార్డు ఇన్‌చార్జ్ పసుల సుధాకర్, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

గూడూరు: పట్టణంలోని వాల్మీకి దేవాలయంలో బుధవారం నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవలు ఘనంగా జరిగాయి. మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించిన పండితులు బుధవారం వినాయక, వాల్మీకి, సీతా, రామ విగ్రహాలు ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

గృహాలు త్వరగా నిర్మించాలి

కోడుమూరు రూరల్: జగనన్న గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులు త్వరగా ఇళ్లను నిర్మించుకోవాలని హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు సూచించారు.బుధవారంమండలంలోని ఎర్ర దొడ్డి గ్రామంలోఎంపీడీఓ చంద్రశేఖర్‌తో కలిసి జగనన్న కాలనీలో పర్యటించారు. గృహ నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్న గృహ నిర్మాణం పథకం పేదల సొంతింటి కల నెరవేరుస్తోందన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం బిల్లులను మంజూరు చేయడంతో పాటు ఇసుక, ఐరన్, సిమెంట్ అందజేస్తోందన్నారు.

దుకాణాలకు బహిరంగ వేలం

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న మున్సిపల్ షాపులకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. స్థానిక కౌన్సిల్ హాలులో నిర్వహించిన ఈ వేలంలో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ, రెవెన్యూ అధికారి జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాజేశ్వరరావు, సుహేయిల్, వాజిద్, రాజు పాల్గొన్నారు. నగరంలోని 40 షాపులకు గాను మొదటిరోజు 9 షాపులను పాటదారులు పోటీ పడి దక్కించుకున్నారు. పాతబస్టాండ్ మున్సిపల్ ఓపెన్ థియేటర్ వద్ద నిర్మించిన షాపు నంబర్ 8 షేక్ మౌలాలి(రూ.8 లక్షలు), 12వ షాపు జగన్‌మోహన్ రావు (రూ.6 లక్షల 80 వేలు), 13వ షాపును అబ్దుల్ రహిమాన్ (6 లక్షల 25 వేలు), 14వ షాపును మునుస్వామి (రూ.3 లక్షల 50 వేలు), 15వ షాపును సయ్యద్ జాకీర్ బాషా (రూ.3లక్షల 65 వేలు)కు దక్కించుకున్నారు. అలాగే కింగ్ మార్కెట్ వద్ద ఉన్న 52/150–జె షాపును షేక్ అస్లాంబాష (రూ.3 లక్షల 69 వేలకు) దక్కించుకున్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

గడివేముల: ఉద్యాన పంటల్లో సస్యరక్షణ చర్యలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించొచ్చని జిల్లా హార్టికల్చర్ అధికారి నాగరాజు తెలిపారు. బుధవారం ఎల్‌కే తండా పరిధిలో సాగు చేసిన మామిడి, చీని తోటను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ఎస్ శాస్త్రవేత్త సుబ్రమణ్యం, ఏఓ హేమసుందర్‌రెడ్డి, నాబార్డ్ అధికారి హబీబ్, గని సర్పంచ్ కత్తి తులషమ్మ, ఉపసర్పంచ్ శివానంద రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



అమడగుంట్లలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

ఊరూరా పింఛన్ల పండుగ

సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఊరూరా పండుగలా సాగుతోంది. బుధవారం తెల్లవారుజామునే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ సొమ్ము అందజేయడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. తొలిరోజు పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాల్లో దాదాపు 90 శాతం పెన్షన్ పంపిణీ పూర్తి అయింది. ఈ కార్యక్రమాన్ని మండల అధికారులు పర్యవేక్షించారు.

–కోడుమూరు రూరల్/సి. బెళగల్/గడివేముల



బ్రాహ్మణదొడ్డిలో వృద్ధురాలు కుమ్మరి పక్కీరమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రాజు



కర్నూలులో చికిత్స పొందుతున్న గడివేముల మండలం బూజునూరు గ్రామం జంగటి పద్మావతికి పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీరు మధుబాబు